క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: మరమ్మతుల కారణంగా హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 18న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. రెడ్డికాలనీ, కొత్తూరు పాలజెండా, కుమార్పల్లి, కుమార్పల్లి మార్కెట్, బుద్ధభవన్, యాదవనగర్, టైలర్ స్ట్రీట్ ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

స్రవంతికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం పరిశోధకురాలు ఎం.స్రవంతికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఆపరేషనల్ పరఫార్మెన్స్ ఆఫ్ పబ్లిక్ సెక్టార్ బ్యాంక్స్ ఆఫ్ ఇండియా – ఏ స్టడీ ఆఫ్ సెలక్ట్ బ్యాంక్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి స్రవంతికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. కామర్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ ఇంద్రసేనారెడ్డి పర్యవేక్షణలో స్రవంతి తన పీహెచ్డీ పూర్తిచేశారు.

కారు ఇంజన్లో నుంచి పొగలు



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కాకాజీకాలనీలో నిలిపిఉంచిన కారు ఇంజన్లో నుంచి పొగలు రావడంతో అక్కడే ఉన్నవారంతా ఆందోళనకు గురయ్యారు. స్థానికులు సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బందికి అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. శ్రీనివాసరావు అనే వ్యక్తి ఆస్పత్రి పని నిమిత్తం వచ్చి కారును రోడ్డు పక్కన పార్క్ చేశాడు. ఎండలు తీవ్రంగా ఉండడంతో ఏసీ ఆన్ చేసి ఉండడం వలన మంటలు వ్యాపించి ఉంటాయని సమాచారం. అగ్నిమాపక శాఖ అధికారి నాగరాజు, సుధాకర్రెడ్డి, రాజేందర్, యాకూబ్, రూప్సింగ్, బాబు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



మడికొండ: శెట్టి సునీల్కుమార్, రిటైర్డ్ నిట్ ప్రొఫెసర్ సుబ్బరాజు సహకారంతో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ ఆధ్వర్యంలో మడికొండ గ్రామానికి చెందిన 15మంది నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాజీపేట మండల కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నీలం వేణుయాదవ్, దండిగం సతీష్కుమార్, కాజీపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నీలం రజిని, అనిల్కుమార్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

కాజీపేట: కాజీపేట పట్టణంలో నానాటికి ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం కోరారు. ఈమేరకు మున్సిపల్ ప్రధాన కార్యాలయంలో మున్సిపల్ గ్రీవెన్స్లో ఇన్చార్జ్ కమిషనర్ ప్రావీణ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వడ్డెపల్లి చెరువు కట్ట, రహమత్నగర్, జూబ్లీ మార్కెట్, కూరగాయల మార్కెట్, అంబేద్కర్నగర్లలోని ప్రభుత్వ స్థలాలను సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

సీపీఎస్ను రద్దు చేయాలి

విద్యారణ్యపురి: ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దామెర భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేష్ ఒక ప్రకటనలో కోరారు. టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సోమవారం శంకుస్థాపన చేశారు. పాఠశాలలో సుమారు రూ.97 లక్షలతో వ్యయంతో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, మాజీ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల ఆశాజ్యోతి గౌస్

వరంగల్ చౌరస్తా: బహుజన బంధువు, పీడిత వర్గాల ఆశాజ్యోతి ఎంసీపీఐ(యూ)అఖిల భారత ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌస్ అని పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి కొనియాడారు. గౌస్ ద్వితీయ వర్ధంతి సభ, స్తూపం ఆవిష్కరణ కార్యక్రమాలను ఈనెల 19న వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొత్తూరు గ్రామంలో నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



పండ్లు తినిపిస్తున్న నాయిని రాజేందర్



కాజీపేటలో విందు ఇస్తున్న జంగా రాఘవరెడ్డి

హన్మకొండ చౌరస్తా: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్రెడ్డి అన్నారు. హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్హాల్లో నాయిని సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో ముస్లింపెద్దలు, యువత పాల్గొని మత ప్రార్థనలు చేశారు. అనంతరం నాయిని మాట్లాడుతూ 18 ఏళ్లుగా రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అయితే కొంతమంది ఓట్ల కోసం తమ మధ్య విభేదాలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. యునికాన్ కూలర్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమన్నారాయణ, ముస్లిం మతపెద్దలు ఖుస్రూపాషా, అజీజ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రహమత్నగర్లో..

కాజీపేట: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. కాజీపేట రహమత్నగర్లోని ప్యారడైజ్ ఫంక్షన్హాల్లో ముస్లింలకు సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం మతపెద్దలకు ఆయన పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో కట్ల శ్రీనివాస్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్యాదవ్, విజయశ్రీరజాలీ, నాయకులు రేపల్లె శ్రీనాథ్, తోట్ల రాజుయాదవ్, బైరి లింగమూర్తి, గంగుల శ్రీనివాస్రెడ్డి, గుర్రపు కోటేశ్వర్, బోయిని కుమార్, రేపల్లె రంగనాథ్, సందెల విజయ్, వస్కుల శంకర్, కుర్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఖిలా వరంగల్ ఈద్గాలో ఇఫ్తార్ విందు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్రోడ్డులోని ఈద్గా ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పర్యవేక్షణలో బుధవారం సాయంత్రం ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈద్గా మసీదు ఉపాధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ తెలిపారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్రోడ్డులో సోమవారం జరిగిన సమావేశంలో ఇఫ్తార్ విందు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త చూపిన మార్గమే రంజాన్ అని అన్నారు. మెగా ఇఫ్తార్ విందుకు కలెక్టర్ ప్రావీణ్య, సీపీ ఏవీ.రంగనాథ్, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు, అధికారులు, మతపెద్దలు హాజరవుతారని వివరించారు.

అనధికార నిర్మాణాల తొలగింపు



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న సిబ్బంది

వరంగల్ అర్బన్: వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు బల్దియా పరిధిలోని 44వ డివిజన్ తిమ్మాపూర్ బెస్తం చెరువు ప్రాంతంలో అనధికారికంగా నిర్మించిన రేకుల షెడ్డు, కాంపౌండ్ వాల్ నిర్మాణాలను ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది సోమవారం తొలగించారు. దూపకుంటలో సర్వేనంబర్ 1509లో అనధికార లేఅవుట్ హద్దురాళ్లను నేలమట్టం చేశారు. స్థలాలను అనధికారికంగా ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని బల్దియా సిటీ ప్లానర్ వెంకన్న హెచ్చరించారు. కార్యక్రమంలో బల్దియా ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ క్రాంతికుమార్, ఎస్సై రాజిరెడ్డి, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు రాంబాబు, లక్ష్మీనారాయణ, డీఆర్ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 6వ డివిజన్ ఈద్గాలో రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డుకు కార్పొరేటర్ చెన్నం మధు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ అధ్యక్షుడు బాబా, మైనార్టీ నాయకులు కుద్దూస్, గౌస్, రెడ్డి, రాజేశ్వర్, సుమన్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

వేసవిలో శిక్షణ తరగతులు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సదానందం

నయీంనగర్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల విద్యార్థులకు వేసవిలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని ప్రగతిశీల తల్లితండ్రుల సంఘం రాష్ట్ర కో కన్వీనర్ చాతల్ల సదానందం డిమాండ్ చేశారు. హనుమకొండలోని ప్రెస్క్లబ్లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక శిక్షణ తరగతులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. అయితే, శిక్షణ తరగతులు వద్దని గురుకులాల కార్యదర్శులకు కొందరు ఉపాధ్యాయులు లేఖ ఇచ్చారని, దీన్ని పీపీఎల్ సంఘం ఖండిస్తోందని తెలిపారు. శిక్షణ తరగతులు నిర్వహించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సింగపురం అరవింద్, కొయ్యడ దేవరాజ్, కొయ్యడ రఘు తదితరులు పాల్గొన్నారు.

బిల్లా సుధాకర్ సంతాప సభ



ఖిలా వరంగల్: వరంగల్ 37వ డివిజన్ తూర్పుకోటలో సీపీఎం ఏరియా కమిటీ సభ్యుడు తగరపు వేణు ఆధ్వర్యంలో సీపీఎం నేత, దివంగత బిల్లా సుధాకర్ సంతాప సభ సోమవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా సుధాకర్ స్తూపం వద్ద పూలమాలలు ఉంచి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల, తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి వలదాసు దుర్గయ్య, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు నలిగంటి అనిల్, కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు కె.ఉదయ్, అశోక్, రాజు, రాజేష్, నిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కరెంట్ను వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖిలా వరంగల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రవేశ పెట్టిన ఉచితంగా 100 యూనిట్ల వరకు కరెంట్ను లబ్ధిదారులు ఉపయోగించుకోవాలని విద్యుత్ ఏఈ అభిషేక్, స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ సూచించారు. ఈమేరకు వరంగల్ 37వ డివిజన్ పడమరకోట ఎస్సీవాడలో విద్యుత్ అధికారుల ఆధ్వర్యంలో ఉచిత విద్యుత్ పథకంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతీ కుటుంబానికి నూతన మీటర్ బిగించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బోగి సురేష్, బిల్లా శ్రీకాంత్, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'వాగ్దేవి'లో రక్తదాన శిబిరం



హన్మకొండ: హనుమకొండ నయీంనగర్లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో రెడ్క్రాస్ సొసైటీ సహకారంతో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఈసం నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానమని పేర్కొన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని వివరించారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.హరీందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎనుకంటి రజిన్ కుమార్, ఐకాక్ కోఆర్డినేటర్ జి.రాజేంద్రప్రసాద్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ప్రొఫెసర్ రాంరెడ్డి, డాక్టర్ నర్సింహారెడ్డి, కళాశాల ప్రతినిధులు ఎస్.కొమురారెడ్డి, వినయ్రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎంఆర్కేఎస్ జోనల్ ప్రెసిడెంట్గా మోతీలాల్



కేంద్ర మంత్రి కిషన్రెడ్డితో మోతీలాల్

కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే కార్మిక్ సంఘ్ (డీఎంఆర్కేఎస్) సికింద్రాబాద్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్గా కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్లో సీనియర్ టెక్నీషియన్గా పనిచేస్తున్న ఎస్.మోతీలాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్లోని తార్నాకలో ఆదివారం జరిగిన డీఎంఆర్కేఎస్ 31వ జనరల్ కౌన్సిల్ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్రెడ్డి, డీఎంఆర్కేఎస్ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు అర్జున్రావు, శశికుమార్ పర్యవేక్షణలో మోతీలాల్ను పలు రైల్వే డివిజన్ల నుంచి తరలివచ్చిన ఆఫీస్ బేరర్స్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా ప్రెసిడెంట్గా కొనసాగుతున్న మోతీలాల్.. జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్గా ఎన్నిక కావడంపై కాజీపేటలోని డీఎంఆర్కేఎస్ నాయకులు, కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

దళితరత్న ప్రవీణ్కుమార్కు అభినందనలు



ప్రవీణ్కుమార్ను అభినందిస్తున్న అధికారులు

హన్మకొండ: దళితరత్న అవార్డు గ్రహీత కవి, గాయకుడు, రచయిత, బాలల పరిరక్షణ అధికారి సారంప్రవీణ్కుమార్ (కళాశ్రీ)ను కలెక్టర్ సిక్తా పట్నాయక్తో పాటు అధికారులు అభినందించారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ 132వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం హైదరాబాద్లో జరిగిన కార్యక్రమంలో ప్రవీణ్కుమార్కు దళితరత్న అవార్డును ఎమ్మెల్సీ ఎమ్మెస్ ప్రభాకర్, ఆల్ ఇండియా షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ జాతీయ అధ్యక్షుడు ఎస్.రాజు ఉస్తాద్, అంబేద్కర్ వాది జేబి రాజు అందజేశారు. కాగా, కలెక్టరేట్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయనను కలెక్టర్ పట్నాయక్తో పాటు అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి వాసుచంద్ర, డీఆర్డీఓ శ్రీనివాస్ కుమార్, జిల్లా సంక్షేమాధికారి ఎం.సబిత, ఎస్సీ అభివృద్ధి అధికారి నిర్మల, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ అభినందించారు.

ఆకట్టుకుంటున్న చేనేత, హస్తకళా ప్రదర్శన



వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

హన్మకొండ: సుబేదారి – కాజీపేట ప్రధాన రహదారిలో తారా గార్డెన్లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత, హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటోంది. సంప్రదాయంతో పాటు ఫ్యాషన్ ఉట్టిపడే వస్త్ర ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత కళాకారులు రూపొందించిన వస్త్ర ఉత్పత్తులు సిల్క్, కాటన్తో పాటు, మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్పూర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ సారీస్, లినెన్ చీరలు, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్లు, లక్నో, బనారస్ సారీస్, ఖాదీ – మెటీరియల్, వన్గ్రాం గోల్డ్ జ్యువెలరీ ఆకట్టుకుంటున్నాయి. ప్రవేశం ఉచితమని, వారం రోజులు ఈ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి



హన్మకొండ: మహిళతో గ్యాస్ సిలిండర్ మంటలను ఆర్పిస్తున్న అధికారులు



కాశిబుగ్గ: ఓసిటీలో..

హన్మకొండ: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హనుమకొండ అగ్నిమాపక కేంద్రం అధికారి ఎ.నాగరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలపై హనుమకొండ సాయినగర్లో సోమవారం అవగాహన కల్పించారు. ఇళ్లల్లో వినియోగించే గ్యాస్ సిలిండర్లపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగితే మంటలను ఎలా అదుపు చేయాలి, ఎలా ఆర్పి వేయాలో వివరించారు. కార్యక్రమంలో ప్రధాన అగ్నిమాపకుడు బి.సుధాకర్ రెడ్డి, డ్రైవర్ ఎం.రాజేందర్, అగ్నిమాపకులు ఎ.రూప్సింగ్, ఎండీ.యాకూబ్, హోంగార్డులు జి.బాబు, ఎండీ.రహీం తదితరులు పాల్గొన్నారు.

ఓసిటీలో ఫైర్ మాక్డ్రిల్

కాశిబుగ్గ: వరంగల్ 19వ డివిజన్ ఓసిటీలోని గ్రీన్ రెసిడెన్సీలో వరంగల్ ఫైర్ స్టేషన్ సిబ్బంది సోమవారం ఫైర్ మాక్డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అపార్ట్మెంట్ వాసులకు అగ్ని ప్రమాదాలు, గ్యాస్, ఎలక్ట్రికల్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారి శ్రీనివాస్రావు, రవిందర్, సంపత్, చంద్రమౌళి, రాజేందర్, హరిబాబు, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం



మాట్లాడుతున్న డీసీపీ బారి

హసన్పర్తి: వాహనదారులు తప్పనిసరిగా భద్రతా నియమాలు పాటించాలని, లేకుంటే ప్రాణాలకే ప్రమాదమని సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్బారి హెచ్చరించారు. 'ప్రమాదాలు – ప్రాథమిక చికిత్స'పై హసన్పర్తిలోని గ్రీన్వుడ్ పాఠశాలలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు ఆస్పత్రికి తరలించేలోపు ప్రాథమిక చికిత్స చేయించి, అంగవైకల్యం నుంచి కాపాడాలని సూచించారు. సీపీఆర్ ఎలా చేయాలని, ప్రమాదవశాత్తు నీటిలో మునిగినప్పుడు, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణహాని జరగకుండా ఎలా కాపాడాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న ఆటో డ్రైవర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రోడ్ సేఫ్టీ చంద్రబాబు, ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ విజయ్కుమార్, రామకృష్ణ, స్థానిక ఇన్స్పెక్టర్ రావుల నరేందర్, ఎస్సై విజయ్కుమార్, కృష్ణమూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టాదారు పాస్పుస్తకాలు ఇవ్వండి



తహసీల్దార్కు వినతిపత్రం అందజేస్తున్న దళితులు

హసన్పర్తి: భీమారం శివారు సర్వేనంబర్ 340లోని భూములకు పట్టాదారు పాస్పుస్తకాలు జారీ చేయాలని దళితులు కోరారు. ఈమేరకు తహసీల్దార్ నాగేశ్వర్రావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. 1980లో భీమారం ప్రాంతానికి చెందిన 83మంది దళితులకు ఒక్కొక్కరికి 0.20 ఎకరాల చొప్పున అప్పటి ప్రభుత్వం అసైన్డ్ చేసిందని పేర్కొన్నారు. అయితే ఆరేళ్ల క్రితం ఆ భూమిని స్టేడియం కోసం సేకరించారని చెప్పారు. అయితే నష్టపరిహారం మాత్రం ఇవ్వలేదని తెలిపారు. ప్రస్తుతం స్టేడియం నిర్మాణం వెనక్కి తీసుకోవడం వల్ల తమ భూములు తమకు ఇవ్వాలని దళితులు కోరారు.

వడ్డెర మహాసభను జయప్రదం చేయండి



వాల్పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నయీంనగర్: వడ్డెర కులస్తుల హక్కుల సాధనకు ఈనెల 21న హనుమకొండలోని కళ్యాణి ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న వడ్డెర మహాసభను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్క్లబ్లో వడ్డెర మహాసభ వాల్పోస్టర్లను వడ్డెర సంఘం నాయకులు సోమవారం ఆవిష్కరించారు. అనంతరం, సమ్మయ్య మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం వడ్డెర కులస్తులు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణలో వడ్డెరల బతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెరలను షెడ్యూల్ తెగలో చేర్చాలని, వడ్డెర బంధు ప్రవేశపెట్టాలని, కాంట్రాక్ట్ పనుల్లో 20శాతం రిజర్వేషన్ కల్పించాలని, డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బొంత అయిలయ్య, పల్లపు రవిందర్, పల్లపు నవీన్, లక్ష్మీనారాయణ, కస్తూరి రాజు, మంజుల నవీన్, శివరాత్రి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

బాలసముద్రంలో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్ను ప్రారంభిస్తున్న చీఫ్విప్

హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలోని కుడా మైదానంలో ఫన్ అండ్ జాయ్ వాటర్ టన్నెల్ ఫిష్ మ్యూజియం, ఎగ్జిబిషన్ను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్విప్ దాస్యం వినయ్భాస్కర్ సోమవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు, పెద్దలు సాయంత్రం వేళ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేందుకు ఎగ్జిబిషన్ దోహదపడుతుందని అన్నారు. అనంతరం ఎగ్జిబిషన్ నిర్వాహకుడు అస్లాం మాట్లాడుతూ నగరవాసుల కోసం ఈసారి 500 రకాల సముద్ర జలచరాలతో అండర్ వాటర్ టన్నెల్ ఫిష్ అక్వేరియం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కలంకారి, చేనేత, ఫ్యాన్సీ బ్యాంగిల్స్, ఇమిటేషన్ జ్యువెల్లరీ, లెదర్ గూడ్స్, రుచికరమైన కలకత్తా చాట్ బండార్, సిమ్లా మిర్చి, ఢిల్లీ పాపడాల విక్రయాలకు 100కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రభాకర్, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్రాజు యాదవ్, మేనేజర్లు డి.రాజేంద్రప్రసాద్, ఫిరోజ్, కార్పొరేటర్ రావుల కోమల, నాయకులు పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్లో కుక్కల స్వైరవిహారం

- భయాందోళనలో ప్రయాణికులు
- పట్టించుకోని రైల్వే అధికారులు



కాజీపేట జంక్షన్లో సంచరిస్తున్న కుక్కలు



స్టేషన్ ఆవరణలోని ఏటీఎం సెంటర్ వద్ద..

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్లో కుక్కల స్వైరవిహారంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. కుక్కల నివారణకు గ్రేటర్ మున్సిపల్ అధికారులు, రైల్వే అధికారులు ఎవరూ కూడా చర్యలు తీసుకోకపోవడంతో రైల్వేస్టేషన్ ప్లాట్ఫాంలు, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఈక్రమంలో ప్రయాణికులు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. కుక్కల బెడదను అరికట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు చొరవ తీసుకుని కుక్కల నివారణకు తగు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇన్స్పెక్టర్ రాజుకు అభినందనలు



ఇన్స్పెక్టర్ను అభినందిస్తున్న సభ్యులు

కాజీపేట: కాజీపేట ఇన్స్పెక్టర్గా బాధ్యతలు చేపట్టిన సార్ల రాజును తేజోమయి మాలకుల సంక్షేమ సంఘం నగర కమిటీ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్క అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మర్యాల కృష్ణ, బండి విజయ్కుమార్, కోండ్ర సర్సింగరావు, మైలారపు శంకర్, పప్పుల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.